# ముక్క.. ముప్పు!





నేలకొండపల్లిలో రహదారి వెంట విక్రయిస్తున్న మాంసం

## మాంసం విక్రయాల్లో కనిపించని నాణ్యత

- వధశాలలు లేక రోడ్ల వెంట యథేచ్ఛగా విక్రయాలు
- అధికారుల తనిఖీలు శూన్యం
- ప్రజారోగ్యంతో విక్రయదారుల చెలగాటం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

**నేలకొండపల్లి:** మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించటం లేదు. జీవాలు ఆరోగ్యమైనవా.. కాదా అని ధ్రువీకరించాల్సిన పశువైద్యాధికారులు లేక వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్లుగా విక్రయాలు చేపడుతున్నారు. వధశాలలో జీవాలు వధించాల్సి ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పట్టణాల్లో అక్కడక్కడ అధికారులు తనిఖీలు చేపట్టినా మొక్కుబడిగా చేస్తుండడంతో విక్రయదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇక మండల కేంద్రాల్లో కనీసం తొంగి చూసే నాథుడే లేరు. ఆదివారం వచ్చిందంటే క్వింటాల కొద్దీ మాంసం అమ్మకాలు జరుగుతుంటాయి. ఇక పండుగ రోజు అయితే చెప్పనక్కర్లేదు. అపరిశుభ్రత వాతావరణంలో విక్రయాలు చేపడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పలుచోట్ల చనిపోయినవి కూడా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ముద్ర లేకుండానే..**

జీవాలను వధించే ముందు కచ్చితంగా పశువైద్యాధికారి పరీక్షించాలి. ఆ తర్వాత శాఖ తరఫున ముద్ర వేశాక కోసి విక్రయించాలి. కానీ నేలకొండపల్లి మండల కేంద్రాల్లో ఇలాంటి ముద్ర ఒకటి ఉంటుందని కూడా విక్రయదారులకు తెలియకపోవడం గమనార్హం. అంతేకాక పశు వైద్యాధికారులు మాంసం విక్రయ కేంద్రాలు ఉన్నాయన్న సంగతి కూడా తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మాంసం కోసం తీసుకొచ్చే జీవాలను వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా వధించి విక్రయింస్తుండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మాంసం దుకాణాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, వధశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

### నిబంధనలకు నీళ్లు..

- నిబంధనలు ప్రకారం మాంసం విక్రయించే వ్యాపారులు కచ్చితంగా కబేళా(వధశాల) లోనే వధించాలి. సగానికి పైగా వ్యాపారులు ఇంటి వద్దనే జీవాలను వధిస్తున్నారు. స్టాంపు వేసుకోవడం అంటే ఏమిటో కూడా మండల కేంద్రాల్లో విక్రయదారులకు తెలియక యథేచ్ఛగా అమ్ముతున్నారు.
- రోగాల బారిన పడినవి, వయసు పైబడిన జీవాలను వధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- గ్రామాలు, కాలనీల్లోని ఇళ్ల మధ్య కోస్తుండడంతో దుర్వాసన, దోమలు భరించలేక స్థానికుల అవస్థలు పడుతున్నారు.
- నేలకొండపల్లిలో దుమ్ము, ధూళిలో రోడ్ల పక్కనే విక్రయిస్తున్నారు.
- జీవాలను పరిశీలించే వ్యవస్థ ఇక్కడ కనిపించడం లేదని పలువురి ఆరోపిస్తున్నారు.

# క్లుప్తంగా

## ఆర్టిజన్ల సదస్సుకు ఖమ్మం ప్రతినిధులు

**ఖమ్మంవ్యవసాయం:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327 యూనియన్) పిలుపు మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న ఆర్టిజన్ల కార్మికుల చైతన్య సదస్సుకు ఖమ్మం జిల్లా నుంచి సంఘం ప్రతినిధులు బయలుదేరి వెళ్లారు. వెళ్లిన వారిలో సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వల్లాల యుగంధర్, జి.రాందాస్, పి.భాస్కర్, వి.వేణు మోహన్, బి.మంగ్యాజీనాయక్, మంగు రామకృష్ణ, నాగేశ్వరరావు, మల్లిఖార్జున్, సురేష్, పాషా, కృష్ణ, సోమయ్య తదితరులు ఉన్నారు.

## ఆత్మహత్యాయత్నం

**నేలకొండపల్లి:** మండలంలోని చెరువుమాధారానికి చెందిన జి.అఖిల్(24) శుక్రవారం పురుగల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

## 'మహాలక్ష్మి' వర్తింపజేయాలి

**ఖమ్మంమయూరిసెంటర్:** అర్హులందరికీ ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకం వర్తింపజేయాలని మాజీ కార్పొరేటర్ తోట రామారావు అన్నారు. శుక్రవారం 48వ డివిజన్‌వాసులకు మంజూరైన మహాలక్ష్మి పథక ధ్రువీకరణ పత్రాలను కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందాల వెంకట్, బాబా, గుత్తి నవీన్, కృష్ణ నాయక్, పిట్టల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అవార్డుల ప్రదానం

**ఖమ్మంగాంధీచౌక్:** నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సఖీ జాతీయ మహిళా మండలి ఆధ్వర్యాన సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురు మహిళలకు సరోజినీ నాయుడు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను అందించి సత్కరించింది. ఈ సందర్భంగా సంస్థ నేషనల్ ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ.. పేద వర్గాలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**రఘునాథపాలెం:** ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ భద్రమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఈర్లపూడి గ్రామంలో నిర్వహించిన పోషణ మాస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈమేరకు పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలలను వివరించి సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పర్వీన్, తాటాకులతండా పాఠశాల హెచ్‌ఎం నస్రీన్, ప్రమీల, పంగిడి సెక్టార్ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## 'గృహ జ్యోతి' తారుమారు

**నేలకొండపల్లి:** మండలంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నియమించిన కంప్యూటర్ ఆపరేటర్ తప్పుల తడకగా చేయడంతో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. గువ్వలగూడెంకు చెందిన పి.పుల్లయ్య విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన సర్వీస్ నంబర్ 412కు బదులు, ఆపరేటర్ 402గా నమోదు చేశారు. దీంతో అదే గ్రామానికి చెందిన మరొకరికి గృహజ్యోతి పథకం అందుతుంది. పైగా రేషన్ కార్డు లేని వ్యక్తికి ఉచిత విద్యుత్ పొందుతున్నారు. అర్హత ఉన్నా.. ప్రతి నెలా బిల్లు చెల్లిస్తున్నానని, అధికారులు స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తానన్నాడు.

## బీజేపీకి మద్దతు తెలపాలి



సభ్యత్వాలు అందజేస్తున్న తాండ్ర వినోద్‌రావు

**కూసుమంచి/ఖమ్మం మామిళ్లగూడెం:** వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా అందరూ భారతీయ జనతా పార్టీ(బీజేపీ)కి మద్దతు తెలపాలని ఆ పార్టీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు కోరారు. కూసుమంచి మండల కేంద్రంతో పాటు ఖమ్మం 53వ డివిజన్‌లో పర్యటించిన ఆయన పలువురికి సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు నమోదయ్యేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. నాయకులు నున్నా రవికుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, హటియా నాయక్, బెల్లం మురళి, గుండా ఉపేందర్‌రెడ్డి, తాటికొండ రవి, మహేందర్, దనియాకులు వెంకటనారాయణ యాదవ్, చావా కిరణ్, శ్రీజర్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, సమ్మయ్య, చోటు, కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' పనులపై ఓపెన్ ఫోరమ్



ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

**కూసుమంచి:** మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక (ఓపెన్ ఫోరమ్)ను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సామాజిక బృందాలు చేపట్టిన తనిఖీల నివేదికను ఫోరమ్ ముందుంచారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు గానూ తొలిరోజు 17 గ్రామాలకు చెందిన నివేదికలను సమర్పించారు. డీఆర్డీఏ అడిషనల్ పీడీ శిరీష సమక్షంలో నివేదికలను సమర్పించగా పనుల్లో వచ్చిన పలు రిమార్కులపై ఆమె సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, ఏపీడీ శ్రీదేవి, విజిలెన్స్ మేనేజర్ పవన్, ఏపీఓ శాస్త్రి, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఫీసర్ అభిలాష్, ఏపీఓ అప్పారావు, ఎస్ఆర్పీలు సాంబశివాచారి, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

## 'ఎవరినీ తక్కువ చేయలేదు'

**ఖమ్మం మామిళ్లగూడెం:** హైదరాబాద్‌లో జరిగిన మాల ఉద్యోగ సదస్సులో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎవరినీ తక్కువ చేసి మాట్లాడలేదని మాల మహానాడు జిల్లా గౌరవ సలహాదారుడు గుంతేటి వీరభద్రం స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఇరవై ఏళ్లుగా వర్గీకరణ ముసుగులో మాలల మీద మాదిగలు ఎన్నో అవాకులు చవాకులు పలికారని, సుప్రీంకోర్టు వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు మాట్లాడితే.. మాపై దుర్భాషలాడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కనకరాజు, దామల్ల సత్యం కనకయ్య, దయానంద్, మల్లయ్య, భాస్కర్, గంగాధర్, శ్రీను, కనకరత్నం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

**కామేపల్లి:** మండలంలోని సాతానిగూడెం గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో ఇమ్మానుయేలు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జవ్వాజి జెస్సి కుమార్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తుండగా.. సుమారు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భారతి, లతీఫ్, వాసవి, మనోజ్ఞ, సంపత్, జయరాజు, కుసుమ, అరవ అననీయ, గ్రేస్, స్వామి, సమూయేలు, నరసింహ, సనబేగం, రవి, సుబ్రహ్మణం తదితరులు పాల్గొన్నారు.

## వామపక్షాల వైపు ప్రజల చూపు

**తిరుమలాయపాలెం:** వామపక్ష ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా వామపక్షాల వైపే ప్రజలు చూస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీరుద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడులో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంక్షోభాల కారణంగా, ప్రభుత్వాలపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని, వామపక్ష పార్టీలు మాత్రమే ప్రజా సమస్యలు పరిష్కరించగలరని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే చైనా, వియత్నం, క్యూబా ఉత్తరకొరియా లావోస్ లాంటి దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా ఉన్నాయని, వీటికి తోడు ఇప్పుడు నేపాల్, శ్రీలంక లాంటి దేశాలు కూడా జత కలిశాయన్నారు. దేశంలో మతవాద పార్టీల పని అయిపోయిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలపై కార్యకర్తలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా పోలేపొంగు ముత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీను, మండల నాయకులు ఎస్‌డీ జియాఉద్దీన్, నరసయ్య, బింగి రమేష్, వీరన్న, తుశ్లూరు నాగేశ్వరరావు, తంగెళ్ల రమేష్, కొత్తపల్లి వెంకన్న, అల్లి యశోద, దుంపటి సత్యం, భట్టి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## హామీ నెరవేర్చాలి

**తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని అభివృద్ధి చేసి మాతా శిశు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీఎస్పీ నాయకుడు మట్టె నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వత ప్రాతిపదికన వైద్యుల పోస్టులు ఉండాలని, వైద్య పరికరాలు, ఎక్స్‌రే, స్కానింగ్, టెస్టులు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతిరాల నాగభూషణం మాదిగ, కొమ్ము పుల్లయ్య, గుగ్గిళ్ల అశోక్, వశపంగు మల్లయ్య, పోలేపొంగు రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న యర్రా శ్రీకాంత్

**ఖమ్మంఅర్బన్:** అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని ఇందిరానగర్‌లోని పార్టీ కార్యాలయంలో 12వ, 13వ డివిజన్లలో నిర్వహించిన మహాసభల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రజల్లో మతత్వాన్ని రెచ్చగొడుతూ నిత్యం దాడులకు పాల్పడుతున్నారని, కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌గా మార్చారని, రైతన్న దివాలా తీయించేందుకు వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేయాలని ప్రయత్నిస్తుందని, తినే తిండి, వేసుకునే బట్టల మీద కూడా ఆంక్షలు విధిస్తుందని విమర్శించారు. ప్రజలకు అండగా నిలబడి వారి హక్కులను కాపాడేది కమ్యూనిస్టులే అన్నారు. ఇటీవల వచ్చిన మున్నేరు వరదలో వరదయ్యనగర్‌కు చెందిన 30 కుటుంబాలకు వసతి కల్పించి భోజనాలు అందించినట్లు చెప్పారు. శ్రీరామనేని అలివేలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హవేలీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యురాలు, పిన్నింటి రమ్య, హవేలీ డీవైఎఫ్ఐ కార్యదర్శి కొంగరి నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 12వ, 13వ డివిజన్ల నూతన కార్యదర్శులుగా జట్ల ఆనందరావు, గాలి అంజయ్యలను ఏకగ్రీయంగా ఎన్నికున్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం అర్బన్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీఆర్టీయూ అధ్యక్షుడిగా గుడిపూడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బోడ్డు రవికిరణ్, గౌరవ అధ్యక్షుడిగా ఎం.రాములు ఎన్నికయ్యారు. వీరితో పాటు అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.దర్గయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సునీత, మహిళా కార్యదర్శిగా కె.వెంకటకుమారి, ఉపాధ్యక్షుడిగా వసంతరావు, కార్యదర్శులుగా సత్యనారాయణ, రంగారావు, జిల్లా కార్యదర్శిగా గోపాలస్వామిలను ఎన్నికైన వారిలో ఉన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొనగా.. పలువురు అభినందించారు.

**పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా భిక్షం..**



అధ్యక్ష, కార్యదర్శులు భిక్షం, నాగేశ్వరరావు

**తిరుమలాయపాలెం:** పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మక్కపేట పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కుక్క భిక్షం, జెడ్పీఎస్ఎస్ తెట్టెలపాడు పాఠశాల ఉపాధ్యాయుడు జంగం నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రంగారావు సమక్షంలో నిర్వహించిన సమావేశంలో రానున్న మూడేళ్లగాను వీరిని ఎన్నుకున్నారు. వీరితో పాటు మహిళా ఉపాధ్యక్షురాలిగా ఇంటూరి నాగమణితో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు కట్ట శేఖర్, లింగం సతీష్, తూమాటి సుదర్శన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**టీపీటీఎఫ్ మండల కార్యవర్గం..**

**కూసుమంచి:** టీపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈనేపథ్యాన మండల అధ్యక్షుడిగా వి.యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా జె.భద్రూ, ఉపాధ్యక్షులుగా సృజన, శివరాం, మదనాచారి, కార్యదర్శులుగా ఉపేందర్, శంకర్, నాగేందర్, జ్యోతిని ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్యవర్గం పేర్కొంది. జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌తో పాటు ఎన్నికల పరిశీలకులుగా ఉమాదేవి హాజరయ్యారు.

## యువ టూరిజం క్లబ్ ప్రారంభం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఖమ్మం సహకారనగర్:** నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ లోగో, లక్ష్యాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 40మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ యువతలో టూరిజం, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగించడం, పర్యాటక రంగ ప్రోత్సాహం, దేశ వారసత్వ పరిరక్షణకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వీ.రమణ, ఐక్యూ.ఏ.సీ, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ రమాసత్యవతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వీరన్న పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లలో వెనుకబడొద్దు..

**ఆస్తి పన్నుల వసూళ్లపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష**



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

**ఖమ్మంమయూరిసెంటర్:** ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలోనే పన్నులు వసూలు చేస్తాం.. ఆ సమయంలోనే చెల్లిస్తారు.. అంటూ కాలయాపన చేయకుండా ఒక ప్రణాళిక ప్రకారం ఆస్తి పన్నులను వసూలు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆస్తి పన్నుల వసూళ్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా బిల్ కలెక్టర్లు వసూలు చేసిన పన్నులు, గతేడాది ఈ సమయానికి ఎంత వసూలు చేశారని తెలుసుకుని పన్నుల వసూళ్లలో వెనుకబడిన బిల్‌కలెక్టర్ల నుంచి వివరణ కోరారు. కొంతమంది కొత్తగా వచ్చామనే సమాధానం చెప్పడంతో కమిషనర్ కొంత సీరియస్ అయినట్లు తెలిసింది. తాను కొత్తగా వచ్చానని, అన్నింటిపై అవగాహన పొంది పనులు చేయడం లేదా అని బిల్ కలెక్టర్లను మందలించినట్లు తెలిసింది. పన్నుల వసూళ్లలో వెనుకబడొద్దని సూచించినట్లు సమాచారం. ఆర్థిక సంవత్సరాన్ని నాలుగు క్వార్టర్లుగా విభజించుకొని రోజూ ఉదయం భువన్ సర్వే, సాయంత్రం పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పాత బకాయిలను వసూలు చేయాలని, స్పందించకుంటే రెడ్ నోటీసులు ఇవ్వాలన్నారు. అవసరమైతే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి బిల్ కలెక్టర్‌కు మిషన్లను ఇవ్వాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతీవారం పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సంతపకుమార్, ఆర్ఓ జి.శ్రీనివాస్, ఆర్ఐలు, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు. అలాగే కేఎంసీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి కమిషనర్ అగస్త్య సందర్శించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నిర్వాహకులకు సూచించారు.

## డివిజన్లలో మేయర్, కమిషనర్ పర్యటన..

**ఖమ్మంఅర్బన్:** నగరంలో నివాసాల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉన్న ప్లాట్ యజమానులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌తో కలిసి శానిటేషన్ పనుల పరిశీలనలో భాగంగా ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి 1వ, 2వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా 2వ డివిజన్‌లో ఇద్దరు యజమానులకు నోటీసులు అందించారు. అలాగే 1వ డివిజన్‌లో కొత్తగా నిర్మాణంలో ఉన్న కాల్వలు, రోడ్లను పరిశీలించి కాల్వలో నీరు సాఫీగా పోయేలా నిర్మించారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హుస్సేన్, మల్లీదు వెంకటేశ్వర్లు, డీఈ, ఏఈ శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### వ్యర్థాల శుద్ధికి బయో సంస్థ ప్రతిపాదన

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలో జఠిలంగా మారుతున్న డంపింగ్‌యార్డ్ సమస్యకు చెక్ పెట్టేందుకు పాలకవర్గం, అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈనేపథ్యాన రోజువారీగా సేకరించే వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసే సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన భవాని బయో సంస్థ ప్రతినిధి నరేష్ మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో మేయర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. ఎలాంటి చెడు వాసన రాకుండా, ఎప్పటి చెత్తను అప్పుడే సేగ్రిగేషన్ చేసి, తడి చెత్తను ఎరువుగా మార్చుతామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కాగా, ఈ ఎరువును బయట దేశాలూ కొనుగోలు చేస్తున్నాయని, దేశంలో కూడా మంచి డిమాండ్ ఉందని చెప్పారు.

**కార్మికులకు వైద్య శిబిరం..**

స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా కేఎంసీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యలు ప్రారంభించారు. ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**ఖమ్మంవన్‌టౌన్:** నగరంలోని 31వ, 33వ, 34వ, 35వ, 46వ, 48వ డివిజన్లలో మేయర్ నీరజ ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుమ్మల యుగంధర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్, కార్పొరేటర్ రుడావత్ రమాదేవి, బాణాల లక్ష్మణ్, నల్లపు శ్రీను, బెడదం సత్యనారాయణ, సింగం అంజయ్య, రమేష్, ఉపేందర్ శంకర్, మంగ, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ఆపన్నహస్తం



ఖమ్మంగాంధీచౌక్: గ్యాస్‌స్టౌ అందజేస్తున్న తుమ్మల యుగంధర్, ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్



ఖమ్మంమామిళ్లగూడెం: నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ వెలిగేటి చంద్రమోహన్

- **ఖమ్మంగాంధీచౌక్:** మున్నేరు వరద బాధితులకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం 660 కుటుంబాలకు రూ.10 లక్షల విలువైన నిత్యావసరాలు, గ్యాస్‌స్టౌలను నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా అందజేశారు.
- **ఖమ్మంమామిళ్లగూడెం:** మున్నేరు వరద తాకిడికి దెబ్బతిన్న నగరంలోని పద్మావతి నగర్‌తో పాటు రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన 250 మందికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సుమారు రూ.2లక్షల విలువైన నిత్యావసర సరుకులతో పాటు వంట సామగ్రి శుక్రవారం అందజేశారు.
- **ఖమ్మం సహకారనగర్:** మున్నేరు వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల గీతాంజలి పాఠశాల విద్యార్థులు తమ వంతు సాయంగా రూ.30వేలు అందించారు. దీంతో పాఠశాల యాజమాన్యం కలెక్టర్‌కు చెక్కు రూపంలో అందించారు.



ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న గీతాంజలి కరస్పాండెంట్ అప్పారావు, డైరెక్టర్ అరుణ్

# రుణమాఫీకి కుటుంబ నిర్ధారణ తప్పనిసరి



కుటుంబ నిర్ధారణ చేస్తున్న దృశ్యం

**నేలకొండపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పొందేందుకు వెంటనే కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలని మండ్రాజుపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారి అవినాష్ సూచించారు. మండలంలోని కోనాయిగూడెంలో నిర్వహించిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు లేని వారు, రుణమాఫీ కాని రైతులు వెంటనే కుటుంబ నిర్ధారణ చేయించాలని సూచించారు. గ్రామంలో దాదాపు 30 మంది గ్రూపింగ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గువ్వలగూడెం ఏఈఓ సాయినిఖిల, రైతు సమన్వ సమితి కన్వీనర్ మేకల వెంకటేశ్వర్లు, రైతు ప్రతినిధులు ఆనం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శం



ఖమ్మంమామిళ్లగూడెం: వీరనారి మణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని అని పలువురు వక్తలు కొనియడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108 జయంతి సందర్భంగా పలు సంఘాల బాధ్యులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్